క్లుప్తంగా

కాలుష్యరహిత దీపావళి జరుపుకోవాలి



దీపావళిపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ జానకిరామ్

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలో ప్లాస్టిక్ రహిత, కాలుష్య రహితంగా దీపావళి జరుపుకోవాలని మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్ సూచించారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం స్వచ్ఛభారత్ మిషన్ అర్బన్ స్వచ్ఛ దీవాలి.. శుభ దీవాలి ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం మెదక్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చందు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ ఉషా కిరణ్, టౌన్ ప్లానింగ్ అధికారి భూపతి, రెవెన్యూ అధికారి హర్షద్, మెప్మా టీఎంసీ సునీత, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి

మెదక్ మున్సిపాలిటీ: అనుమానాస్పదమైన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని ఎన్నికల పోలీస్ పరిశీలకులు సంతోష్ కుమార్ తుకారాం సూచించారు. గురువారం ఆయనకు జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ సమస్యలు లేదా ఎన్నికల పారదర్శకత పై ప్రజలు నేరుగా తనకు (8125390500)ఫోన్ చేయవచ్చునని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన నివేదికలు ఎప్పటికప్పుడు నివేదించాలని ఆదేశించారు. అనంతరం శాంతి భద్రతలు, చెక్‌పోస్టులు, స్వాధీనం చేసుకున్న సామగ్రి తదితర అంశాలపై ఎస్పీతో చర్చించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్‌తోపాటు జిల్లాలోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అందరు కలిసి మెలిసి ఉండాలి

నర్సాపూర్: కళాశాలకు చెందిన సీనియర్, జూనియర్ విద్యార్థులు కలిసి మెలిసి ఉండాలని నర్సాపూర్‌లోని విష్ణు ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపాల్ రమేశ్ అన్నారు. గురువారం కాలేజీలో ఫ్రెషర్స్ పార్టీ ఏర్పాటు చేశారు. ఫ్రెషర్స్ పార్టీ సందర్భంగా పలువురు విద్యార్థులతో కలిసి ప్రిన్సిపాల్ కేక్ కట్ చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని హస్తాల్‌పూర్ గ్రామ శివారులోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని గ్రామస్తులు దాతల సహకారంతో అభివృద్ధి చేస్తున్నారు. అందులో భాగంగానే తాళలపల్లి శశికళ, విఠల్‌గుప్తా దంపతులు ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళంగా అందజేశారు. దీంతో దాతను ఆలయ నిర్వాహకులు పెంటారెడ్డి, లక్ష్మీనారాయణ, రాజు, పాండురంగం శాలువాతో సత్కరించారు.

వైభవంగా గీతా ఆశ్రమ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సదాశివనగరంలోని శ్రీ గీతా ఆశ్రమ 24వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా గురు జెండా ఊరేగింపు, ధ్వజారోహణ కార్యక్రమం ఆశ్రమ నిర్మాణ సమన్వయకర్త బోయిని నారాయణ మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం సత్సంగ సమావేశం, గురుపూజ చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వారికి భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు.

ఈటలను గెలిపించండి

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని జీడిపల్లి గ్రామంలో బీజేపీ నాయకులు గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కమ్మరి నరేందర్‌చారి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు నత్తి మల్లేశ్, బీజేపీ నాయకులు వెంకటేశ్‌గౌడ్, బాల్‌రాజ్, ప్రణయ్, వెంకట్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

అదృశ్యమై.. శవమైన వృద్ధుడు

రామాయంపేట(మెదక్): అదృశ్యమైన వృద్ధుడు గురువారం పాడుబడ్డ బావిలో శవమై తేలిన సంఘటన రామాయంపేటలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేట పట్టణానికి చెందిన పెంద్యం పోచయ్య (70) అనే వృద్ధుడు మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగిరాలేదు. దీనితో అతని కుటుంబ సభ్యులు వెతికినా.. ఆచూకీ లభించలేదు. ఉదయం అతడి మృతదేహం మల్లెచెరువు శివారులో పాడుబడ్డ బావిలో తేలింది. ఎస్‌ఐ రంజిత్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక తనిఖీల్లో ప్రతిసారీ తప్పులే..

- ఉపాధిహామీ పనుల పరిశీలన
- అడిషనల్ పీడీ విరోజా ఆగ్రహం



ప్రజాదర్బార్ నిర్వహిస్తున్న అధికారులు

అల్లాదుర్గం(మెదక్): ప్రతిసారీ సామాజిక తనిఖీల్లో తప్పులు చేస్తున్నారని, విధుల్లో నిర్లక్ష్యంపై డీఆర్‌డీఏ అదనపు పీడీ విరోజా ఉపాధి హామీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అల్లాదుర్గం మండలంలో మార్చి 2022 నుంచి మార్చి 31, 2023 వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులపై గురువారం ఆమె సామాజిక తనిఖీ చేపట్టారు. మండలంలో 252 పనులకు 2,72,40,454 రూపాయల పనులు చేపట్టారు. అందులో కూలీల పేమెంట్ రూ.2,43,63,851 కాగా, మెటీరియల్ పేమెంట్ రూ: 28,76,603ల పనులు చేయగా వాటికి సంబంధించి సామాజిక తనిఖీచేసి గురువారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు, కార్యదర్శులు పొరపాట్లు చేయకుండా విధులపై మనసు పెట్టి పనులు చేయాలని ఆదేశించారు. హరిత హారం పథకం కింద మొక్కలు నాటడంతో లక్ష్యం నేరవేరదని, వాటిని వంద శాతం సంరక్షించినప్పుడే అనుకున్న లక్ష్యం నేరవెరుతుందన్నారు.

రూ: 12,705 రికవరీ

మండలంలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన పొరపాట్లకు సిబ్బంది నుంచి రూ.12,705 రికవరీ చేశామని, రూ.5 వేలు జరిమానా విధించినట్లు ఏపీడీ విరోజా చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్, జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీహరి, క్యూసీ రమాకాంత్, ఏపీఓ నవాజ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యను అందించాలి



మాట్లాడుతున్న డీఈఓ రాధాకిషన్

వెల్దుర్తి(తూప్రాన్): విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించేలా గుణాత్మక విద్య అందించాలని డీఈఓ రాధాకిషన్ ఉపాధ్యాయులకు సూచించారు. వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు కొనసాగుతున్న కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన తనిఖీ చేసి శిక్షకులు, ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలు అందజేశారు. పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక తరగతులు సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం యాదగిరి, ఉపాధ్యాయులు సాంబయ్య, వెంకటేశం, సంఘమేశ్వర్, నవీన్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్య తప్పదు



నోటీసులు ఇస్తున్న కార్యదర్శి యాదగిరి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని కార్యదర్శి యాదగిరి అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని జగ్గంపేట గ్రామంలో అక్రమంగా ఇంటి నిర్మాణం చేపట్టిన వారికి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేపట్టడని, గతంలో ఇదే స్థలంలో ఎలాంటి అనుమతి లేకుంగా ఓ ప్రార్థనాలయం నిర్మిస్తుండగా అడ్డుకొని నోటీసులు ఇచ్చామన్నారు. ప్రస్తుతం ఆ స్థలంలో ఏ నిర్మాణం జరుగుతుందో అనుమతి తీసుకుంటేనే తెలుస్తుందన్నారు.

కాంప్లెక్స్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్‌పీలు

పెద్దశంకరంపేట(మెదక్): కాంప్లెక్స్ సమావేశాలను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని నోడల్ అధికారి వెంకటేశం అన్నారు. గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై ఉపాధ్యాయులకు ఆర్‌పీలు కుమార్, గోపీ, వెంకటేశం, కిశోర్, గోవింద్, రాధాకిషన్ అవగాహన కల్పించారు. విద్యార్థులకు సులభతరంగా బోధించడం, తొలిమెట్టు(ఎఫ్ఎల్ఎన్)పై వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల కంప్లెక్స్ హెచ్‌ఎంలు సుభాశ్, విఠల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీసు బలగాల ఫ్లాగ్ మార్చ్



కంచన్‌పల్లిలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కంచన్‌పల్లి, సదాశివపల్లి, ధర్మాసాగర్ పంచాయతీల్లో గురువారం రాత్రి పోలీసు బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌడిపల్లి ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు ధైర్యాన్ని ఇచ్చేందుకు ఫ్లాగ్ మార్చ్ చేయడం జరిగిందన్నారు. ఎలాంటి భయం లేకుండా ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహిస్తామని ప్రజలు వందశాతం ఓటు వేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ ఎలియాస్ రెడ్డి, పీసీ బాగయ్య, పోలీసులు పాల్గొన్నారు.

మహిళలకు కూరగాయ విత్తనాల అందజేత



విత్తనాలు అందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో మహిళా రైతులకు పెరటితోట కూరగాయల విత్తనాలను సెహగల్ ఫౌండేషన్ ద్వారా అందించారు. ఈ సందర్భంగా హైటెక్ సీడ్ కంపెనీకి చెందిన విత్తనాలు అందిస్తున్నట్లు డైరెక్టర్ రెయాన పేర్కొన్నారు. విత్తనాలతో పాటు సోలార్‌తో పని చేసే స్ప్రే పంపులు కూడా అందించారు. ఈ కార్యక్రమంలో సెహగల్ ప్రతినిధులు సలావుద్దీన్, బాలరాజు, మనోజ్, సునీల్, మారుతీ, విజయ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

జ్యువెలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌చారి

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని జ్యువెలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు గురువారం మెదక్‌లో జరిగాయి. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడిగా రాచపల్లి శ్రీనివాస్‌చారి, గౌరవ సలహాదారు మోత్కూరి లక్ష్మీకాంతం, గౌరవ అధ్యక్షులుగా సయ్యద్ నసీర్ అహ్మద్, పూనా రవి, ప్రధాన కార్యదర్శిగా వనపర్తి సురేశ్, కోశాధికారిగా రమేశ్‌లను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా జె.ఎల్. శ్రీనివాస్, సయ్యద్ గఫార్ నియాజీ, ఏలేశ్వరం విశ్వనాథం, సహాయ కార్యదర్శిలుగా నాగారం కుమార్, నాగారం చందు, సయ్యద్ నజీర్, సుంకోజు అజయ్ ఎన్నికయ్యారు. సాంస్కృతిక కార్యదర్శులుగా సిద్ధంశెట్టి సుమన్, దాసోజు వేణు, పూనా భూమేశ్, దామరంచ అజయ్, జుబేర్, పీఆర్‌ఓగా రాచపల్లి లక్ష్మణ్, కోఆర్డినేటర్లుగా వీరమల్లి కిశోర్, షకీల్ ఎన్నికయ్యారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న బ్రహ్మాజీ

కౌడిపల్లి(నర్సాపూర్): ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని డీడబ్ల్యూఓ బ్రహ్మాజీ కోరారు. గురువారం కౌడిపల్లిలోని అంగడిలో మహిళ, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఓటు వేయాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకావద్దన్నారు. అనంతరం నర్సాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ హేమభార్గవి మాట్లాడుతూ ప్రజా చైతన్యంతోనే మార్పు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ హేమభార్గవి, కౌడిపల్లి, రాయిలాపూర్, శివ్వంపేట సెక్టార్ సూపర్‌వైజర్లు శశికళ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

1559 మంది బైండోవర్

ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 1559 మందిని బైండోవర్ చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. గురువారం మెదక్ జిల్లా నూతన పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన జిల్లా చెక్ పోస్టులలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ అమలు అయినప్పటి నుంచి ఇప్పటి వరకు 2616 లీటర్ల మద్యం, రూ.2,09,12,398 స్వాధీనం చేసుకుని 23 ఎన్నికల ఉల్లంఘన కేసుల నమోదు చేసి జిల్లా వ్యాప్తంగా 1559 మంది బైండోవర్ చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ క్రీడా జట్టు ఎంపిక



ఎంపికైన వారితో ప్రతినిధులు

మనోహరాబాద్(తూప్రాన్): స్థానిక క్రీడా ప్రాంగణంలో రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ క్రీడాజట్టును ఎన్నుకున్నట్లు రాష్ట్ర బేస్‌బాల్ ప్రధాన కార్యదర్శి శ్వేత తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల నుంచి ఐదుగురు చొప్పున ఎంపికచేశామని, ఈ నెల 26 నుంచి పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో వారు పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండియా కోచ్ కృష్ణాగౌడ్, జిల్లా బేస్‌బాల్ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, అజయ్‌గౌడ్, మల్లేశ్‌గౌడ్, సతీశ్, నర్సింలు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్ పనులు సక్రమంగా నిర్వహించాలి

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధిహామీ పనులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటుచేశారు. గ్రామాల్లో నర్సరీల నిర్వహణ, హరిత హారంలో నాటిన మొక్కల సంరక్షణతో పాటు ఉపాధిహామీ పనుల ప్రారంభంపై సమీక్ష నిర్వహించారు. త్వరలో ప్రారంభం కానున్న ఉపాధిహామీ పనులపై కూలీలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీఓ మోహన్, టీఏలు, ఎఫ్ఏలు, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

పాముకాటుతో యువతి మృతి

హవేళీఘనాపూర్(మెదక్): పాముకాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఫరీద్‌పూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫరీద్‌పూర్ గ్రామానికి చెందిన మూడబోయిన ప్రకాశం కుమార్తె లక్ష్మి(25) బుధవారం ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో పాముకాటు వేసింది. ఈ విషయం గమనించిన కుటుంబీకులు ఆమెను వెంటనే మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు. మృతురాలి సోదరుడు వినోద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కొత్త ప్రభాకర్‌రెడ్డికి స్వాగతం

మనోహరాబాద్(తూప్రాన్): దుబ్బాకలో నామినేషన్ వేయడానికి అంబులెన్సులో వెళ్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి మనోహరాబాద్ మండల బీఆర్ఎస్ నాయకులు కాళ్లకల్‌లో ఘన స్వాగతం పలికారు. గురువారం దుబ్బాకకు వెళ్తున్న ఆయన్ను మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మహేశ్ ఆధ్వర్యంలో మండల ప్రజాప్రతినిధులు స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



కొనుగోలు కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేశ్‌కుమార్

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని బచ్చురాజ్‌పల్లి గ్రామంలో గురువారం తహసీల్దార్ సురేశ్ కుమార్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు వరి ధాన్యాన్ని పూర్తిస్థాయిలో ఆరబెట్టిన తర్వాత తూకం వేయించుకోవాలన్నారు. ఏ గ్రేడ్ రకం ధాన్యాన్ని తీసుకొచ్చి తూకం వేయించిన అనంతరం పట్టాపాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంక్ పుస్తకం జిరాక్స్ అందజేయాలని తెలిపారు. రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు స్వప్న, ఎంపీఎస్ఓ సందీప్ రెడ్డితో పాటు రైతులు, కూలీలు పాల్గొన్నారు.

కథల పుస్తకాలతో జ్ఞానం పెరుగుదల



పుస్తకావిష్కరణ చేస్తున్న ఎంఈఓ

శివ్వంపేట(నర్సాపూర్): కథల పుస్తకాల ద్వారా విద్యార్థులకు జ్ఞానం పెరుగుతుందని ఎంఈఓ బుచ్చానాయక్ అన్నారు. గురువారం శివ్వంపేట ఉన్నత పాఠశాలలో అక్షర సేద్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పుస్తకాలు బడి పిల్లలకు నేస్తాలని, నిత్యం వీటిని చదవడం వల్ల విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ఎంతగానో దోహద పడుతాయన్నారు. అక్షర సేద్యం ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజు మాట్లాడుతూ.. మండలంలోని ప్రతీ పాఠశాలలో గ్రంథాలయ ఏర్పాటు చేసి, పలు విలువైన పుస్తకాలు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికుమార్, వంశీ, సుధాకర్, అర్చన, జ్యోతి, కుమార్, కృష్ణమాచారి, రాజేంద్రప్రసాద్ తదితరులు ఉన్నారు.

నార్మల్ డెలివరీపై అవగాహన కల్పించండి



అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి

రామాయంపేట(మెదక్): నార్మల్ డెలివరీపై అవగాహన కల్పించాలని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి అన్నారు. ఆస్పత్రి పరిధిలోని రామాయంపేట, చిన్నశంకరంపేట, నార్సింగి, నిజాంపేట మండలాల డాక్టర్లు, ఏఎంఎన్‌లు, ఆశ కార్యకర్తలతో ఆస్పత్రిలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గర్భిణులు కాన్పుకోసం ప్రైవేట్‌కు కాకుండా ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేలా వారికి అవగాహన కల్పించాలని సూచించారు. మొదటిసారిగా గర్భం ధరించిన వారు సాధ్యమైనంతమేరకు నార్మల్ డెలివరీకై వెళ్లేలా మనం వారికి వివరించాలని అన్నారు. గత నెలలో ప్రభుత్వ ఆస్పత్రిలో ఏడు కాన్పులు మాత్రమే అయ్యాయని, వాటి సంఖ్య పెరుగాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రగతి ధర్మారం, నార్సింగి, చిన్న శంకరంపేట పీహెచ్‌సీ డాక్టర్లు హరిప్రియ, రవికుమార్, సింధు, గైనకాలజిస్ట్ డాక్టర్ సుష్మవాణి, హెడ్ నర్స్ జయలక్ష్మి, తదితరులు నాలుగు మండలాల ఆశ కార్యాకర్తలు, ఏఎస్ఎంలు పాల్గొన్నారు.

పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కొల్చారం(నర్సాపూర్): మండలంలో రంగంపేట గ్రామ ప్రధాన రహదారి పక్కన మంచినీరు సరఫరా అయ్యే పైపులైన్ పగిలి వృథాగా పోతుంది. దీంతో ఈ వార్త బుధవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైంది. దీంతో స్పందించిన గ్రామ పంచాయతీ పాలకవర్గం పగిలిన పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించడంతో ప్రజల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శివకుమార్‌గౌడ్ సంకల్పం గొప్పది

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి గూడూర్ గ్రామంలో హైకోర్టు న్యాయవాది శివకుమార్‌గౌడ్ నిర్మించతలపెట్టిన శ్రీగురుపీఠం సంకల్పం గొప్పదని ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మాజీ మంత్రి సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. గురుపీఠంలో శ్రీదత్తాత్రేయ మహాస్వామి, సాయిబాబా ఆలయ నిర్మాణానికి సంబంధించి గురువారం శిలాన్యాస పత్రికను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివకుమార్‌గౌడ్ మాట్లాడుతూ డిసెంబర్ 7న శిలాన్యాసం భగవాన్ శ్రీశ్రీశ్రీ విష్ణుయోగి విశ్వంజి మహరాజ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ మన్సూర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకటరామిరెడ్డి, సర్పంచ్‌లు పత్రాల శ్రీనివాస్‌గౌడ్, గైనిబైటి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు తిప్పలు



తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా బుధవారం రాత్రి అకాల వర్షానికి చాలా గ్రామాల్లో వరి ధాన్యం తడిసి పోయింది. దీంతో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు గురువారం ఉదయం రైతులు ఇంటిల్లిపాది కల్లాల వద్దకు చేరుకొని నానా ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ధాన్యాన్ని ఆరబోసిన రైతుల బాధ వర్ణనాతీతం. ఇన్ని అవస్థలు పడుతున్న ఏ అధికారి రాలేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని కోరారు.